సాక్షి రంగారెడ్డి

గురువారం ￼ 25 ￼ జూలై ￼ 2024





**భయం.. భయం..**

రహదారుల పక్కన, నివాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. 8లో▸



**పోలీసుల ఆకస్మిక తనిఖీ**

మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. 8లో▸



## నేడు పెద్దఅంబర్‌పేట మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



**అంశం :** పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
**మున్సిపాలిటీ :** పెద్దఅంబర్‌పేట
**కమిషనర్ :** ఎస్. రవీందర్‌రెడ్డి
**తేదీ :** 25-7-2024 (గురువారం)
**సమయం :** ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
**90304 13639**

## న్యూస్‌రీల్

### నేటి నుంచి జేఈ వ్యాక్సినేషన్

తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు టీకా తప్పనిసరి



మాట్లాడుతున్న వైద్యాధికారి అన్నపూర్ణ

**మొయినాబాద్ రూరల్:** చిన్నారులకు మెదడు వాపు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేస్తున్నట్లు మండల వైద్యాధికారి అన్నపూర్ణ, మండల విద్యాధికారి వెంకటయ్య వెల్లడించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఏఎన్ఎంలకు జేఈ వ్యాక్సినేషన్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ.. గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో మెదడువాపు వ్యాధి నివారణ టీకా వేయడం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తొమ్మిది నెలలు పూర్తైన చిన్నారుల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు జేఈ టీకా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సారాఫాతిమా, ఫిర్దోష్‌బేగం, సాయిబాబా, దినేష్, సూపర్‌వైజర్ సునీతాదేవి, మనీష్, లక్ష్మి, నర్సింహ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, మల్లయ్య, నర్సింహారెడ్డి, శోభారాణి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 1 నుంచి యోగా శిక్షణ

**హుడాకాంప్లెక్స్:** నిత్యం యోగాభ్యాసం చేసే వారికి రోగనిరోధక శక్తి మెరుగవుతుందని యోగారత్న అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురూజీ అన్నారు. నిత్య యోగా సాధన కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎలాంటి అనారోగ్యమైనా, మానసిక సమస్య అయినా దూరం చేసే శక్తి యోగాకు ఉందని, అంతటి ప్రాధాన్యం ఉన్న యోగాను నిత్యం సాధన చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 1 నుంచి హుడాకాంప్లెక్స్‌లోని నిత్య యోగా సాధన కేంద్రంలో ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత యోగా శిక్షణ ఉంటుందన్నారు. అధిక బరువు, బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, సర్వైకల్ స్పాండిలైటిస్, ఆస్తమా వంటి సమస్యలు 15 రోజుల్లో తగ్గించుకోవచ్చన్నారు. వివరాలకు 9603256572 నంబర్‌లో సంప్రదించాలన్నారు.


### ప్రయాణికుడి లగేజీ నుంచి విదేశీ కరెన్సీ చోరీ

**శంషాబాద్ రూరల్:** విమాన ప్రయాణికుడి లగేజీ నుంచి విదేశీ కరెన్సీ దొంగతనం జరిగిన ఘటన శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన అక్బర్ మంగళవారం రాత్రి దుబాయ్ నుంచి విమానంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాడు. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి తన లగేజీని పరిశీలించాడు. అందులో విదేశీ కరెన్సీతో పాటు విలువైన వస్తువులు తస్కరణకు గురైనట్లు గుర్తించాడు. బుధవారం ఆర్జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విమానాశ్రయంలో విమాన సిబ్బంది అతని లగేజీ నుంచి వీటిని దొంగిలించినట్లు.. అనుమానితున్ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# ఆశలన్నీ.. భట్టిపైనే!

### నిధులు కేటాయిస్తేనే పనుల రువ్వడి

- 'పాలమూరు-రంగారెడ్డి'కి ఏళ్ల నుంచి నిరీక్షణ
- ఎల్బీనగర్-హయత్‌నగర్, నాగోల్-శంషాబాద్ మెట్రో విస్తరణపై ఆసక్తి
- శంషాబాద్-మహేశ్వరం మధ్య న్యూయార్క్ సిటీ తయారీకి నిధులు ఎన్నో?
- ముఖ్యమంత్రి హామీలపై జిల్లా వాసుల ఎదురుచూపు



**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో తొలిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ గురువారం అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతోంది. ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ఉదయం పది గంటలకు అసెంబ్లీలో బడ్జెట్ పద్దును ప్రవేశపెట్టనున్నారు. ఆయన జిల్లాకు ఎలాంటి వరాలు కురిపించబోతున్నారనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వారే కావడం.. ఇప్పటికే వారు జిల్లా వాసులకు ఎన్నో హామీలు ఇచ్చిన విషయం విదితమే. అయితే ఆ మేరకు కేటాయింపులు ఉంటాయా? అనే దానిపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. గత పాలకుల హయాంలో ఆశించిన స్థాయిలో నిధులు కేటాయింపులు లేక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు వెనుకబడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వంలో కీలక వ్యక్తులు జిల్లా వారే కావడంతో బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాకు సముచిత స్థానం లభిస్తుందని ఆశిస్తున్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు, నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, అరాంఘర్‌ల మీదుగా శంషాబాద్ వరకు, అటు నుంచి మహేశ్వరం వరకు మెట్రో లైన్‌ను విస్తరించనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్ పలుమార్లు ప్రకటనలు చేశారు. రెండు రోజుల క్రితం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో వీటి ప్రస్తావన లేకపోవడంతో జిల్లా ప్రజలు పూర్తిగా ఆర్థిక మంత్రి భట్టి పైనే ఆశలు పెట్టుకున్నారు. ఆయన విదల్చబోయే నిధులపైనే జిల్లా భవిష్యత్ ఆధారపడి ఉంది.

**టౌన్‌షిప్‌లకు నిధులు కేటాయించేనా?**

కాలుష్యకారక ఫార్మా కంపెనీలను ఔటర్ అవతలికి తరలించాలనే ఉద్దేశంతో 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముచ్చర్ల వద్ద గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటును ప్రతిపాదించింది. ఆ తర్వాత బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల భూములను సేకరించింది. ఇందుకు ఇప్పటికే రూ.600 కోట్లకుపైగా ఖర్చు చేసింది. ఇక్కడ 412 ఫార్మాకంపెనీలు, 173 బల్క్ డ్రగ్ యూనిట్లు నెలకొల్పాలని సంకల్పించింది. అయితే ఇటీవలి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం పాలవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం జరిగింది. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా యాచారం ఫార్మాసిటీని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీని స్థానంలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు, ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ఐటీ అనుబంధ కంపెనీలు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేసింది. శంషాబాద్-మహేశ్వరం మధ్యలో న్యూయార్క్ తరహా సిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కంపెనీలు తమ పెట్టుబడులు పెట్టాలన్నా.. నూయార్క్ తరహా నగరాలను ఏర్పాటు చేయాలన్నా.. రోడ్లు, తాగునీటి సరఫరా, పార్కుల అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంది. ప్రభుత్వం వీటికి కొత్త బడ్జెట్‌లో ఏ మేరకు ప్రాధాన్యత కల్పిస్తుందో వేచి చూడాల్సిందే.

**ఆ ఇళ్లు.. ఇతర భవనాలు పూర్తి అయ్యేనా?**

జిల్లాలో గత ప్రభుత్వ హాయంలో 275.09 ఎకరాల విస్తీర్ణంలో 6,645 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. వీటిలో ఇప్పటి వరకు 2,221 ఇళ్లను మాత్రమే పూర్తి చేసింది. మరో 2,757 ఇళ్లు తుది దశల్లో ఉన్నాయి. వీటిని పూర్తి చేసేందుకు కనీసం రూ.12 కోట్ల వరకు అవసరమని అంచనా వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టబోతున్న ఈ బడ్జెట్‌లో ఈ ఇళ్లకు తగిన నిధులు కేటాయిస్తుందా లేదా వేచి చూడాల్సిందే. ఇప్పటికే ఈ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 89,700 మంది మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో రూ.218 కోట్ల అంచనా వ్యయంతో పది కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే ఏడు చోట్ల పనులు పూర్తి కాగా, మరో మూడు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో రూ.39 కోట్ల అంచనా వ్యయంతో 19 జూనియర్ కాలేజీల్లో మరమ్మతు పనులు చేపట్టాల ని నిర్ణయించి, ఇప్పటి వరకు ఒక కాలేజీలోనే పని పూర్తి చేసింది. మిగిలిన కాలేజీల్లో నిధులు లేక పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. రూ.622 కోట్ల అంచనా వ్యయంతో 14 ఆత్మగౌరవ భవనాల నిర్మా ణ పనులు చేపట్టింది. ఇప్పటి వరకు ఒక భవనం మాత్రమే పూర్తైంది. అదే విధంగా రూ. 12.9 కోట్ల అంచనా వ్యయంతో 11 డిగ్రీ కాలేజీలు నిర్మించాలని నిర్ణయించి, ఇప్పటికీ నాలుగు భవనాలు నిర్మాణదశలోనే ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రభుత్వ భవనాలు సత్వరమే పూర్తి కావాలంటే.. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాల్సిందే.

### 'మనఊరు మనబడి'కి ప్రాధాన్యత దక్కేనా?

మనఊరు మనబడి పథకం కింద జిల్లాలో రూ.97.88 కోట్ల అంచనాతో 464 పాఠశాలలను ఎంపిక చేసి, 448 పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీరు, ప్రహరీల నిర్మాణం, విద్యుద్దీకరణ, డైనింగ్‌హాల్స్, టాయ్‌లెట్స్ విత్ రన్నింగ్ వాటర్, కిచెన్‌షెడ్లు, మేజర్ అండ్ మైనర్ వర్కులు చేపట్టారు. ఆయా పనులు పూర్తి చేసిన చిరు కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు రాకపోవడంతో వారంతా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బడ్జెట్‌లో వీటికి నిధులు కేటాయిస్తే కానీ ఆయా పనులకు డబ్బులు మంజూరు చేయలేని పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఉదయం సీఎం అల్పాహారం అందజేత పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుత ప్రభుత్వం దీన్ని కొనసాగిస్తుందా? బడ్జెట్‌లో ఈ పథకానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందనేది వేచి చూడాల్సిందే.!



అధికారులతో సమావేశమైన కలెక్టర్ శశాంక

# సీజనల్‌పై అప్రమత్తత అవసరం

కలెక్టర్ శశాంక

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** సీజనల్ వ్యాధులపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని.. వారిని వ్యాధులబారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన వనమహోత్సవం, మహిళాశక్తి, సీజనల్ వ్యాధులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి స్పెషల్ అధికారులు అందుబాటులో ఉంటూ రోజు వారీ పనులు విధిగా నిర్వహించాలన్నారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యంపై ప్రతీ రోజు నివేదిక పంపించాలని డీపీఓకు సూచించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు.

**ఫ్రైడే.. డ్రై డే**

వైద్యారోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీ రాజ్ తదితర శాఖలు సమన్వయంతో పని చేస్తూ, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరిస్తూ, అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలని అన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని, వ్యాధుల పరిస్థితిపై రోజువారీగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. డెంగీ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టి ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, అన్ని ఇండ్లు, సంస్థల్లో నిలువ నీటిని, చెత్తను తొలగించాలన్నారు.

**మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయండి**

గ్రామాల వారీగా మహిళా సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లు, మైక్రో ఎంటర్ ప్రైజెస్, మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు పారదర్శకంగా ఉండాలని సూచించారు. బస్టాండ్ సమీపంలో, జనాల రద్దీ ఉన్నచోటును గుర్తించి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, గిరిజన సంక్షేమ జిల్లా అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అటవీ అధికారి సుధాకర్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి తనిఖీ



వనస్థలిపురంలోని ఏరియా ఆస్పత్రిని బుధవారం కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది, పేషెంట్లకు సంబంధించిన వార్డులను పరిశీలించారు. డాక్టర్లు, ఆస్పత్రి పరిసరాల పార్కింగ్ సమస్య ఆయన దృష్టికి రావడంతో వెంటనే పార్కింగ్ సమస్య పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. సిబ్బంది విధుల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఏరియా ఆస్పత్రి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీవరేజ్, తాగునీరు సమస్యలపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్, సీవరేజ్ బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారించాలని అధికారులకు సూచించారు. లిఫ్ట్, మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణం, సిటీ స్కాన్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు టీఎస్ఎంఐడీసీ అధికారులతో చర్చించామన్నారు. తనిఖీలో భాగంగా మహేశ్వరం మెడికల్ కాలేజ్ కు సంబంధించిన డాక్టర్లు, ప్రొఫెసర్లు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, వెంటనే వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మహేశ్వరం మెడికల్ కళాశాల నిర్వహణకు చేపడుతున్న పనులను కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ, టీఎస్ఎంఐడీసీ అధికారులు, మండల అధికారుల బృందంతో పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జి.రాజు యాదవ్, టీఎస్ఎంఐడీసీ అధికారులు, హయత్‌గర్ తహసీల్దార్, డాక్టర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మికులకు విముక్తి

**శంకర్‌పల్లి:** దుకాణాల్లో పని చేస్తున్న ఐదుగురు బాల కార్మికులకు ఆపరేషన్ ముస్కాన్ టీం విముక్తి కల్పించింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముస్కాన్ టీం బుధవారం పట్టణంలో పర్యటించింది. పలు దుకాణాలు, హోటళ్లలో పని చేస్తున్న ఐదుగురు బాల కార్మికులను గుర్తించింది. అనంతరం వారికి టీం సభ్యులుకౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. పిల్లలను పనిలో పెట్టుకున్న దుకాణాలపై జువెనైల్ జస్టిస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షిస్తామని ఎస్ఐ సంతోష్‌రెడ్డి హెచ్చరించారు.

**బేకరీలో ఒకరు..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** బేకరీలో పని చేస్తున్న బాల కార్మికుడికి పోలీసులు విముక్తి కల్పించారు. ఈ సంఘటన ఆదిబట్ల ఠాణా పరిధి తుర్కయంజాల్‌లో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. బోయపల్లి రవికుమార్ తుర్కయంజాల్‌లో బేకర్స్ హబ్ బేకరీ నిర్వహిస్తున్నాడు. ఇందులో బాలుడు(15)తో పనిచేయించుకుంటున్నాడు. పోలీసులు బాలుడిని జువైనల్ హోంకి తరలించారు. యజమానిపై కేసు నమోదు చేశారు.

**తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో..**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి వైఎస్ఆర్ నగర్ సమీపంలో విజయ దుర్గ కంపెనీలో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన బాల కార్మికుడు(15)కు పోలీసులు విముక్తి కల్పించారు. అనంతరం యజమాని ముత్యాల శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బాలుడికి పని నుంచి విముక్తి కల్పించామన్నారు.



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు, సీజ్ చేసిన బైక్

# విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

### నాటుసారా పట్టివేత, ముగ్గురి అరెస్టు

**ఆమనగల్లు:** కడ్తాల్, మాడ్గుల మండలాల్లో బుధవారం ఎక్సైజ్ సీఐ బద్యానాథ్‌చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో 13 లీటర్ల నాటుసారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గుల మండలం రాందుగ్యాల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం అగ్రహారంతండాకు చెందిన నేనావత్ రఘు ద్విచక్ర వాహనంపై ఐదు లీటర్ల సారాను తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిని అరెస్ట్ చేసి సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ దేవాలయం వెనుక భాగంలో సారా విక్రయిస్తున్న రెండు దుకాణాలపై దాడి చేశారు. ఈ ఘటనలో రామావత్ సోన, ఇస్లావత్ దోశీల వద్ద ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. వివిధ కేసుల్లో ఉన్న ఇద్దర్ని, కడ్తాల్ తహసీల్దార్ వద్ద ఒకరిని, తలకొండపల్లి తహసీల్దార్ వద్ద మరొకరిని బైండోవర్ చేశారు. ఈ దాడుల్లో ఎస్ఐలు అరుణ్‌కుమార్, కృష్ణప్రసాద్, స్వప్న, సిబ్బంది శంకర్, దశరథ్, బాబు, శ్రీజ, ప్రవీణ్, లోక్య పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులు ఇవ్వండి

- ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

**యాచారం:** నూతన రేషన్ కార్డులు ఇవ్వకుండా సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా తీసుకోవడం సరికాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో యాచారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులు ప్రామాణికం పెట్టడం సరికాదని.. అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు రేషన్ సరుకులు, ఇండ్లు, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు ఇవ్వలేకనే రేవంత్ రెడ్డి సర్కార్ అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం చేసిన మోసాన్నే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని మండి పడ్డారు. ఎన్నికల ముందు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్ దుకాణాల ఏర్పాటుకు అవకాశం ఉన్న భర్తీ చేయడం లేదన్నారు.

**రుణమాఫీ బోగస్**

రేవంత్‌రెడ్డి ప్రకటించిన రుణమాఫీ పెద్ద బోగస్ అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ అన్నారు. ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి ఎలాంటి నింబంధనలు, షరుతులు లేకుండా రూ.2లక్షల రుణాలున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా రూ.లక్ష లోపు రుణమాఫీలో 30 శాతం మంది రైతులకు కూడా మాఫీ వర్తించలేదన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అయ్యప్పకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగని యాదయ్య, మేకల యాదగిరి రెడ్డి, గొల్లపల్లి జంగయ్యగౌడ్, పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, నడుకుడి కృష్ణ, విజయకుమార్, శ్రీధర్‌గౌడ్, శాంతికుమార్, పగుడాల శ్రీశైలం, శ్రీనాథ్, పత్తి రాజు, పల్లపు నరేష్, గొరిగే బీరప్ప పాల్గొన్నారు.

## పోలీసుల ఆకస్మిక తనిఖీ

**సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**


కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏసీపీ కాశిరెడ్డి, సీఐ నాగరాజు

**మీర్‌పేట:** రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, సీఐ నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నందనవనం, భూపేష్‌గుప్తానగర్, వాంబేకాలని, ఇంద్రసేనారెడ్డినగర్, మజీద్‌గల్లీలో తిరుగుతూ కిరాణాషాపులను తనిఖీ చేశారు. బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న పండగలు, ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. అదే విధంగా నంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐలు సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## హక్కులను కాలరాస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న జైపాల్ రెడ్డి

**రాజేంద్రనగర్:** కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదని మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల ఫేస్ స్కానర్ హాజరు పేరుతో కార్మికుల జీతాలకు కోతలు విధిస్తున్నారని... విధులు నిర్వహించినా కూడా టెక్నికల్ సమస్యలతో కార్మికుల జీతాలు కట్ అవుతున్నాయని మండిపడ్డారు. పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన వేతనంతో కూడిన వారాంతపు సెలవులు గతంలో ఇచ్చినట్లు ఇవ్వక పోతే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. గ్రేటర్ పరిధిలో పని చేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని.. కార్మికులకు పర్మినెంట్ చేసే వరకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. రాజేంద్రనగర్ మండల కార్యదర్శి పి.ఆనంద్, శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్, ఏఎస్ఎఫ్‌లు అనిల్, ఎల్లప్ప, చందు, వినయ్, శ్రీకాంత్, జాషువా ఉన్నారు.

## 15 మంది జీపీ కార్యదర్శుల బదిలీ

**తలకొండపల్లి:** మండల పరిధి నుంచి 15 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారని ఎంపీడీఓ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ఆయన పేర్కొన్నారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దూర్‌తండా కార్యదర్శి మహ్మద్ వాజిద్, జంగారెడ్డిపల్లిలో జానయ్య, తుమ్మలకుంటతండాలో శ్రీనివాస్, తలకొండపల్లిలో రాఘవేందర్, పాతకోటతండాలో రమేష్, చెన్నారంలో ఉమాదేవి, ఖానాపూర్‌లో అలివేలు, బల్బులపల్లితండాలో సందీప్‌కుమార్, చౌదర్‌పల్లిలో బాలురాజు, దేవుని పడకల్‌లో జంగయ్య, గడ్డమీదితండాలో విజయ్‌కుమార్, గట్టుఇప్పలపల్లిలో రాఘవేందర్, కోరింతకుంటతండాలో పరమేశ్వర్, పూల్‌సింగ్‌తండాలో పవన్‌రెడ్డి, వెంకటాపూర్‌లో గోరటి జంగయ్యలు బదిలీ అయ్యారు. కొత్తగా వచ్చిన వారు.. పెద్దూర్‌తండాకు లింగస్వామి, జంగారెడ్డిపల్లికి లింగారెడ్డి, తుమ్మలకుంటతండాకు రాఘవేందర్, తలకొండపల్లికి జి.సత్యం, పాతకోటతండాకు గణేశ్, చెన్నారానికి ఎన్.రాజు, ఖానాపూర్‌కు వి.రాఘవేందర్‌లు ఆయా గ్రామాల్లో విధుల్లో చేరినట్లు ఆయన వెల్లడించారు.

## యాచకుడి మృతి

**కేశంపేట:** యాచకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాగేశ్వర్‌రావు పాటిగడ్డ గ్రామ పరిసరాల్లో నెల రోజులుగా రోడ్ల వెంట తిరుగుతూ.. భిక్షాటన చేస్తున్నాడు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా చలికి తట్టుకోలేక మృతి చెందాడు. బస్‌షెల్టర్‌లో ఉన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్టీల్ షాపులో చోరీ

**మొయినాబాద్:** దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టి స్టీల్, సిమెంట్ షాపులో చోరీ చేశారు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన మండడి మధుసూదన్‌రెడ్డికి మొయినాబాద్‌లోని రాధాస్వామి సత్సంగ్ ఎదురుగా స్టీల్, సిమెంటు దుకాణం ఉంది. రోజులాగే మంగళవారం రాత్రి షాపు మూసి వెళ్లారు. బుధవారం తెల్లవారు జాము 3.45 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులోని టీవీ, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. యజమాని షాపు తెరిచే సమయానికి వచ్చి చూడగా.. తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న అనంతరం సీసీ కెమరాలను పరిశీలించారు. చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో నిందితుడు

**షాద్‌నగర్:** గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఎలికట్ట గ్రామ శివారు పారిశ్రామిక ప్రాంతంలో తరుణ్‌జోష్ జైన్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐలు శ్రీను నాయక్, సునీత, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో గంజాయి విక్రయిస్తున్న తరుణ్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు, నిందితుడి నుంచి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తరుణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

## రుణమాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలు

**శంషాబాద్ రూరల్:** మండలంలోని శంకరాపురం, సంఘీగూడ, పెద్దగోల్కొండ గ్రామాల్లో బుధవారం రైతులను జిల్లా వ్యవసాయధికారి గీతారెడ్డి కలిసి రుణమాఫీ వివరాలు సేకరించారు. ఆగస్టు 15 వరకు రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని గీతారెడ్డి అన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. ఏడీఏ లీనా, ఏఓ కవిత, ఎంఈఓ రాఘవేందర్ పాల్గొన్నారు.

# భయం.. భయం..


అప్పారెడ్డిగూడలో రోడ్డు పక్కన కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

- రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పొంచి ఉన్న ప్రమాదాలు

**నందిగామ:** ఎలాంటి రక్షణ కల్పించకుండా రహదారుల పక్కన, నివాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉందని, విషయం తెలిసినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. జనవాసాలకు దూరంగా నియంత్రికలు ఏర్పాటు చేయాలని, తప్పనిసరి అయితే చుట్టూ కంచె ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటి చర్యలేవి చేపట్టకుండా విద్యుత్ అధికారులు ఇష్టంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రోడ్లు, ఇళ్లు, పాఠశాలలు, రద్దీ ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో అనేక ప్రమాదాలు జరిగాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### జరిగిన ప్రమాదాలు

రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుదాఘాతానికి గురైఓ పాడి పశువుతో పాటు వీర్లపల్లిలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మామిడిపల్లిలో ఒకరు విద్యుత్ షాక్‌తో తన చేతి వేళ్లను కోల్పోయాడు. నర్సప్పగూడలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేయడానికి వెళ్లి వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఇలా నిత్యం ఎక్కడో ఓచోట ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు తగిన రక్షణ చర్యలు చేపట్టడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

### ఎక్కడెక్కడ అంటే..


మేకగూడలో రోడ్డు పక్కన..

మేకగూడలో బస్టాప్ సమీపాన, చేగూరు తిమ్మాపూర్ రోడ్డు, వీర్లపల్లిలో మామిడిపల్లి రోడ్డుకు ఆనుకుని, అప్పారెడ్డిగూడలో వీర్లపల్లి రోడ్డుకు, మండల కేంద్రమైన నందిగామలో పీఏసీఎస్ కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కంచెలు మరిచారు. ఇలా ఏర్పాటు చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. రక్షణగా చుట్టూ కంచెలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు.

### కంచెలు ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎక్కడ పడితే అక్కడ ఏర్పాటు చేశారు. మేకగూడలో బస్‌స్టాప్ వద్ద ప్రమాదకరంగా ఉంది. ఇలాంటివి ఎక్కడెక్కడ ఉన్నా.. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేయాలి. ప్రజలకు, మూగజీవాలకు రక్షణ కల్పించాలి.

– జెల్ల శంకరయ్య, నందిగామ

### దిమ్మెల ఎత్తు పెంచుతాం

రహదారుల పక్కన, నివాసాల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణగా కంచె ఏర్పాటు ప్రతిపాదన ఇప్పటి వరకు లేదు. ప్రమాదకరంగా ఉన్న చోట్ల దిమ్మెల ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. కరెంటు సరఫరాలో ఎక్కడ ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, ఏఈ ట్రాన్స్‌కో, నందిగామ

# మానవ అక్రమ రవాణాను అరికట్టండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమణి

**సీడీపీఓ నాగమణి**

**షాద్‌నగర్‌రూరల్:** మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ నాగమణి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధి లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో అక్రమ రవాణా నిర్మూలనపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో సీడీపీఓ మాట్లాడారు. మానవ రవాణా పెద్ద నేరమని, నిత్యం ఎంతో మంది అబలలు చీకటి కోణంలోకి నెట్టివేయబడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగం, ప్రేమ వివాహం, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. తమవంతు బాధ్యతగా అంగన్‌వాడీ టీచర్లు తమ పరిధిలోని మహిళలు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. తరలింపు సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

### పునరావాసం కల్పించాం

మానవ రవాణాను అరికట్టేందుకు తమ సంస్థ 28 సంవత్సరాలుగా కృషి చేస్తుందని స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఆ ఉచ్చులో బిగుసుకున్న వారిని కాపాడి, పునరావాసం కల్పించామని వెల్లడించారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసుకొని, అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం అధికారిణి మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, వెంకటమ్మ, ప్రజ్వల సిబ్బంది అనిల్‌కుమార్, మిథాలిరాజ్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


కుమార్ మృతదేహం

**మంచాల:** మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి నోముల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ బబ్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా, లక్ష్మీదేవి పల్లి మండలం, బంగారు చెలక్క గ్రామానికి చెందిన గోధుమల కుమార్(30) నోముల గ్రామంలోని తిరుమల ఆయిల్ మిల్‌లో పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం భార్యభర్తలు గొడవపడ్డారు. అనంతరం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన కుమార్.. సోమవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన తోటి కూలీలు వెంటనే చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## దుండగులను అరెస్టు చేయాలి

**బడంగ్‌పేట్:** దళిత కార్పొరేటర్ మహేందర్‌పై దాడి చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్‌ను బుధవారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడారు. దాడి గురించి మహేందర్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసినా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టడంతో పాటు.. జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు అంబేద్కర్, కాశీపేట శివాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి పురుషోత్తం, రాష్ట్ర కోశాధికారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా కార్యదర్శి నాగార్జునబాబు, బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పోతె రాజు, చిత్రం శ్రీనివాస్, మల్లేశ్, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

## 'కమాండ్ కంట్రోల్'కు కేటాయింపులు ఉండేనా?

**సాక్షి, సిటీబ్యూరో:** రాష్ట్ర పోలీసు విభాగానికే తలమానికంగా బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.12లో అందుబాటులోకి వచ్చిన తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (టీజీ సీసీసీ) ఈ బడ్జెట్‌లో ఎంత కేటాయింపులు చేస్తారనే ఉత్కంఠ నెలకొంది. దీని నిర్మాణం పూర్తయినప్పటికీ నగరంపై పటిష్ట నిఘా కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమీకరించుకోవాల్సి ఉంది. గతేడాది బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించినప్పటికీ.. అన్ని హంగులు సమకూర్చలేదు. అనలిటిక్స్ సహా కొత్త టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావడానికి భారీ కేటాయింపులు అనివార్యం. మరోపక్క దీని నిర్వహణ నగర పోలీసు విభాగానికి భారంగా మారనుంది. ఈ నేపథ్యంలో టీజీ సీసీసీ మెయింటెనెన్స్‌కు కేటాయించాల్సిన అవసరం ఉంది. నగరంలో ఉన్న సీసీ కెమెరాల్లో అనేకం తరచు మరమ్మతులకు గురవుతున్నాయి. స్థానికులు ఏర్పాటు చేసిన కెమెరాల నిర్వహణ పెను సవాల్‌గా మారుతోంది. దీంతో సీసీ కెమెరాల నిర్వహణకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. నగరంలో కొత్తగా ఏర్పడిన డివిజన్లు, ఠాణాల్లో అనేకం ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో, శిథిలావస్థలో ఉన్న వాటిలో నడుస్తున్నాయి. వీటికి కొత్త భవనాల నిర్మాణం అనివార్యంగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం భారీ కేటాయింపులే చేయాల్సి ఉంది. హైదరాబాద్ కేంద్రంగా కొత్తగా ఏర్పాటైన తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకూ గత బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులు దక్కలేదు. నార్కోటిక్స్‌కు రూ.3.1 కోట్లు, సైబర్‌కు రూ.కోటి మాత్రమే వచ్చాయి. ప్రాథమిక అంచనా ప్రకారం రాష్ట్ర స్థాయిలో పని చేసే నార్కోటిక్స్ బ్యూరోకి నాలుగు ఠాణాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలతో పాటు వరంగల్‌లో ఇవి అందుబాటులోకి రానున్నాయి. వీటికి అవసరమైన భవనాలు, మౌలిక వసతులకు నిధులు కేటాయించాలి. ఏళ్లుగా నత్తనడకన సాగుతున్న మేడిపల్లిలో రాచకొండ పోలీసు కమిషనరేట్ నిర్మాణం 12 నెలల్లో పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. దీనికి అవసరమైన స్థాయిలే కేటాంపులు వస్తేనే ఇది సాధ్యమవుతుంది. గత ఏడాది హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కింద రూ.216 కోట్లు కేటాయించారు.

## యూనివర్సిటీలకు వరాలిచ్చేనా?

**సాక్షి, సిటీబ్యూరో:** రాష్ట్ర బడ్జెట్‌పై విశ్వవిద్యాలయాలు భారీ ఆశలు పెట్టుకున్నాయి. ఇప్పటికే వర్సిటీలకు సరైన నిధులు లేక అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన మొక్కుబడిగా తయారైంది. పరిశోధనలు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. రాష్ట్రం మొత్తం 15 విశ్వవిద్యాలయాలు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలోనే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. గతేడాది బడ్జెట్‌లో ఉస్మానియా వర్సిటీకి రూ.457 కోట్లు కేటాయించింది. అంబేద్కర్ వర్సిటీకి రూ.214 కోట్లు కేటాయింపులు జరిపింది. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయానికి రూ.45.01 కోట్లు, జేఎన్‌టీయూ హైదరాబాద్‌కు రూ.48 కోట్లు, జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్‌కు రూ.26 కోట్లు కేటాయించారు. మహిళా యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించారు. అయితే నిధుల విడుదల మాత్రం అంతంతమాత్రంగానే ఉండటంతో అభివృద్ధి పనులతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పనులు ముందుకు సాగలేదు. ఈసారి పద్దు కోసం భారీ స్థాయిలో వర్సిటీలు ప్రతిపాదలు సమర్పించాయి.